ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు ఇంటిని మరిపించేలా ఉండాలి

భద్రాచలం, జూన్ 2: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు ఇంటిని మరిపించేలా ఉండాలని, విద్యార్థులకు అన్ని వసతులు సమకూర్చడం జరిగిందని భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ అన్నారు. ఆదివారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని స్పెషల్ ఆఫీసర్లతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులందరూ బెడ్ల పైనే పడుకునే విధంగా కాట్ కటింగ్ పనులు,పాఠశాల గదిలో గాలి, వెలుతురు దారాళంగా వచ్చేలా వెంటిలేటర్‌కు మెస్‌లు ఏర్పాచేశామన్నారు. మంచినీటి సరఫరా, ట్యాపులు, టాయిలెట్లు, బాత్రూంలు,డైనేజీలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు.

పాలమూరు ఎమ్మెల్సీ బీఆర్ఎస్ కైవసం పట్ల హర్షం

దమ్మపేట, జూన్ 2 : పాలమూరు ఎమ్మెల్సీని బీఆర్ఎస్ సొంతం చేసుకోవడం పట్ల ఆ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి దొడ్డా రమేశ్ అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లాలో బీఆర్ఎస్ పాగా వేయడం శుభ పరిణామమని ఆయన అన్నారు.

విద్యార్థులకు సన్మానం

అశ్వారావుపేట, జూన్ 2 : మండల వ్యాప్తంగా టెన్త్, ఇంటర్మీడియేట్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్, శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయ కమిటీలు ఆదివారం ఘనంగా సన్మానించాయి. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామ్మూర్తి, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు సంకా ప్రసాద్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు శీమకుర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. భవిష్యత్ ఉన్నతికి విద్య దోహదపడుతుందని, తల్లిదండ్రులు పిల్లలను చదువుకోవడంలో ప్రోత్సాహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా సంఘాల బాధ్యులు భోగవల్లి రాంబాబు, జల్లిపల్లి దేవరాజు, ముత్తా సుమాకర్, లోకనాథ్ గుప్త, శీమకుర్తి సుబ్బారావు, తాతా శ్రీను పాల్గొన్నారు.

ముగిసిన తిప్పనపల్లి పెద్దమ్మతల్లి జాతర

చంద్రుగొండ, జూన్ 2 : మండలంలోని తిప్పనపల్లి పెద్దమ్మతల్లి జాతర ఆదివారంతో ముగిసింది. భక్తులు అగ్నిగుండంలో ప్రవేశం చేసి తమ భక్తిని చాటుకున్నారు. చుట్టు ప్రక్కల గ్రామాల నుంచి వందలాదిగా భక్తులు తరలివచ్చి తమ భక్తిని చాటుకున్నారు. ప్రతి రెండేండ్లకు ఒక్కసారి జరిగే జాతరకు ఈ ప్రాంత గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల కోసం ఆలయ, ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

6 నుంచి సహకార సంఘాలకు ఎన్నికలు

భద్రాద్రి కొత్తగూడెం, జూన్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీ ఉత్తర్వుల ప్రకారం జిల్లాలోని వివిధ సహకార సంఘాలకు ఈ నెల 6 నుంచి 19 వరకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా సహకార అధికారి సయ్యద్ ఖుర్షీద్ ఆదివారం తెలిపారు. జిల్లాలోని 2 పరపతి సహకార సంఘాలు, ఒక మత్స్య పారిశ్రామిక సహకార సంఘం, 3 లేబర్ కాంట్రాక్టు సహకార సంఘాలు, 2 కల్లు గీత సహకార సంఘాలకు ఈ ఎన్నికలు నిర్వహించనున్నట్లు వివరించారు. మిగిలిన సంఘాల ఎన్నికలను దశల వారీగా నిర్ణీత గడువులోపు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్నికల కోసం తెలంగాణ రాష్ట్ర సహకార సంఘాల చట్టం 1964 ప్రకారం కమిటీ గడువు పూర్తి అవుతున్న సంఘాల వారు 60 రోజుల ముందు ఎన్నికల ప్రతిపాదనలను రాష్ట్ర సహకార ఎన్నికల అథారిటీకి కానీ, జిల్లా సహకార అధికారికి కానీ సమర్పించాలని సూచించారు.

విద్యార్థినికి అభినందన

జూలూరుపాడు, జూన్ 2: ఏకలవ్య స్కూల్ పోటీ పరీక్షల్లో సత్తా చాటిన విద్యార్థులను జూలూరుపాడు ఎంపీటీసీ పెండేల రాజశేఖర్ ఆదివారం సాయిఎక్స్‌లెంట్ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అభినందించారు. సాయిఎక్స్‌లెంట్ పాఠశాలకు చెందిన విద్యార్థులు 6వ తరగతి ప్రవేశ పరీక్షలో అర్హత సాధించడంపై ఉపాధ్యాయులను, విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఆరెబోయిన కృష్ణప్రసాద్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

పాల్వంచ రూరల్, జూన్ 2: మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయానికి ఆదివారం భక్తుల సందడి నెలకొన్నది. ఆదివారం సెలవు కావడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులతో ఆలయ పరిసరాలు కిటకిటలాడాయి. భక్తులు తమ కుటుంబాలతో చెట్లకింద వంటావార్పు కార్యక్రమాలు జరుపుకున్నారు.

భద్రాద్రి రామయ్యకు సువర్ణ పుష్పార్చన

భద్రాచలం, జూన్ 2: భద్రాచలం సీతారామచంద్రస్వామి దివ్యక్షేత్రంలో ఆదివారం అంతరాలయంలోని మూలవరులకు 108సువర్ణ పుష్పాలతో అర్చకులు అర్చన జరిపారు. ఉదయం అంతరాలయంలోని ధృవమూర్తులకు ప్రత్యేక అభిషేకం జరిపారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి స్వామికి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య హోమాలు, నిత్య బలిహరణం, తదితర నిత్య పూజలు జరిపారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న దాతలకు స్వామివారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

దమ్మపేట : రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకానికి సెల్యూట్ చేస్తున్న జూనియర్ సివిల్ జడ్జి రామారావు

అశ్వారావుపేట : తెలంగాణ తల్లి విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కొత్తగూడెం అర్బన్ : అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న 1969 ఉద్యమకారులు

అంబరాన్నంటిన ఆవిర్భావ దినోత్సవ సంబురం

తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా వైభవంగా నిర్వహించారు. ఆదివారం ప్రభుత్వ, ప్రైవేట్, పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలల్లో జాతీయ జెండాను ఆవిష్కరించి, మిఠాయిలు పంపిణీ చేసి, సంబురాలు జరుపుకున్నారు. అనంతరం రాష్ట్ర గేయాన్ని ఆలపించి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకతను వక్తలు కొనియాడారు. జై తెలంగాణ నినాదాలతో హోరెత్తించారు. పలు సెంటర్లలో తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి జై తెలంగాణ, జైజై కేసీఆర్ నినాదాలు చేశారు. సింగరేణి కొత్తగూడెం ఏరియాలో తెలంగాణ రన్ నిర్వహించారు. తెలంగాణ తల్లికి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ప్రొఫెసర్ జయశంకర్‌కి పూలమాలలు వేసి అలంకరించారు. అమరవీరుల స్థూపానికి పూలమాల వేశారు. -నమస్తే నెట్‌వర్క్

పాల్వంచ : తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేస్తున్న రాజుగౌడ్

రామవరం : మాట్లాడుతున్న ఏరియా జీఎం శాలెంరాజు

మణుగూరు టౌన్: డీఎస్పీ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న డీఎస్పీ రవీందర్‌రెడ్డి

భద్రాచలం: ఐటీడీఏలో జెండాను ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

భద్రాచలం: దేవస్థానం సీఆర్వో కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న దేవస్థానం ఈవో ఎల్ రమాదేవి

కేసీఆర్ నాయకత్వంలో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడింది

- నాడు ఆవిర్భావ ఉత్సవాలు నెలరోజుల పాటు జరిగేవి
- నేడు ఒక్కరోజుకే పరిమితం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సిలివేరి సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వర్లు

మాట్లాడుతున్న బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సత్యనారాయణ

ఇల్లెందు, జూన్ 2 : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు సిలివేరి సత్యనారాయణ, పరుచూరి వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జగదాంబసెంటర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఆవిర్భావ ఉత్సవాలను నెలరోజుల పాటు నిర్వహించేవారమని గుర్తుచేశారు. నేడు సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్ర కేవలం ఒక్కరోజుకే పరిమితం చేసేలా ఉత్సవాలు నిర్వహించుకోవడం బాధాకరంగా ఉందన్నారు. నాటి తెలంగాణ ఉద్యమంలో సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలను తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అజ్మీర బావ్‌సింగ్, దేవీలాల్‌నాయక్, ఆదూరి రవి, డేరంగుల పోశం, ఎర్రబెల్లి క్రిష్ణయ్య, ఎస్‌కె ఖాజా, చోటమియా, బండి రమేష్, జానీబాబు, హరిప్రసాద్, ఎలమద్ది రవి, అబ్దుల్‌నభి, కృష్ణారావు, రాజేష్, పాలడుగు రాజశేఖర్, శ్రీనివాస్, ధనలక్ష్మి, చంద్రావతి, సరిత తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులతోనే తెలంగాణ ఉద్యమం మరింత పదునెక్కింది

ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్

సంబురాల్లో మాట్లాడుతున్న ఏరియా జీఎం ఆనంద్

ఇల్లెందు రూరల్, జూన్ 2 : సింగరేణి కార్మికులతోనే తెలంగాణ ఉద్యమం మరింత పదునెక్కిందని ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ అన్నారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జీఎం కార్యాలయంలో సంబురాలు నిర్వహించి జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జగదాంబసెంటర్లోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. తెలంగాణ పరుగు పందెంను ప్రారంభించి ఆదివాసీల సాంప్రదాయబద్ధంగా తలపై కొమ్ముపాగా ధరించి డప్పు వాయిద్యాలతో నృత్యాలు చేసుకుంటూ పరుగుపందెంలో ఉత్సాహాన్ని నింపారు. జేకే కాలనీలోని సింగరేణి హైస్కూల్ వద్ద గల గ్రౌండ్‌లో పరుగు పందెం ముగిసింది. సాయంత్రం 6 గంటలకు వివిధ రుచులతో కూడిన స్టాల్స్ ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్తమ ఉద్యోగులకు సన్మానం, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడారు. కార్యక్రమంలో సేవా అధ్యక్షురాలు నిమ్మి ఆనంద్, ఎస్ వోటూజీఎం మల్లారపు మల్లయ్య, జేకే ఓసీ వెంకటేశ్వర్లు, కేవోసీ పీవో శ్రీనివాస్‌రావు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, ఉద్యోగులు, అధికారులు, ఉద్యోగుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

BUSINESS OFFER

★ఇన్సూరెన్స్ రంగంలో గొప్ప బిజినెస్ అవకాశం మీరు ఖమ్మం, కొత్తగూడెం వారా ? మీరు నిరుద్యోగులా / గృహిణి / రిటైర్డ్‌ఎంప్లాయ్ / వ్యాపార / రియల్‌ఎస్టేట్ / చిట్ / పోస్టల్ ఏజెంట్స్ / డాక్టర్ / చార్టెడ్ అకౌంటెంట్ / టాక్స్ కన్సల్టెంట్ / బ్యూటిషియన్ ఎవరైనా, ఎటువంటి పెట్టుబడి లేకుండా బిజినెస్ చేయాలని ఆసక్తికలిగి లీడర్ / ఏజెంట్ & పార్టనర్‌గా ఎదగాలని అనుకుంటే ఈ అవకాశం మీ కొరకే. సంప్ర : 7780662996

NTKMM-

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.

NT-327724-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించ కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదాతు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వాహన తనిఖీల్లో పట్టుబడ్డ గంజాయి

జూలూరుపాడు, జూన్ 2: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదుట ఎస్సై జీవన్‌రాజు తన సిబ్బందితో కలిసి ఆదివారం వాహన తనిఖీలు నిర్వహించారు. కొత్తగూడెం వైపు నుంచి ఖమ్మం వైపు బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులను ఆపి తనిఖీలు చేపట్టారు. వారి వద్ద సుమారు 4 కేజీల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకొని ద్విచక్రవాహనన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేస్తున్నారు.

పాతకక్షలతో మహిళ పై దాడి

పాల్వంచ రూరల్, జూన్ 2: పాతకక్షల నేపథ్యంలో ఒక మహిళ.. బంధువు వరుస అయిన మరో మహిళపై దాడి చేసిన ఘటన పాల్వంచ మండలం నాగారం కాలనీ పంచాయతిలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నాగారం కాలనీకి చెందిన జర్పుల లక్ష్మికి ఆదే గ్రామంలో ఉంటున్న ఆమె వదిన పాలికి పాత కక్షలున్నాయి. అయితే పాతకక్షలను దృష్టిలో ఉంచుకుని ఆదివారం లక్ష్మి ఇంటికి పాలి వచ్చి ఘర్షణ పడింది. ఆమెను బెదిరించి రాయితో గాయ పర్చింది. దీంతో లక్ష్మి కంటికి బలమైన గాయమైంది. లక్ష్మి ఫిర్యాదు మేరకు పాలిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈతకు వెళ్లి బాలుడు మృతి

పాల్వంచ, జూన్ 2: స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన బాలుడు మృతిచెందిన ఘటన పట్టణంలోని కేటీసీఎస్ కాలువ వద్ద ఆదివారం జరిగింది. బంధువులు తెలిపిన వివరాలు.. మున్సిపాలిటీ పరిధిలోని శివనగర్‌కు చెందిన అలవాల రాములు కుమారుడు గౌతం (17) తన స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లాడు. రాములు తాపీ మేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. తన కుమారుడు గౌతమ్ ఇంటర్ చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో ఈత కొట్టేందుకు స్నేహితులతో కలిసి కరకవాగు వద్ద కేటీపీఎస్ కాలువకు వెళ్లారు. స్నేహితులు ఈత నేర్చుకుంటుండగా ఒడ్డున ఉన్న గౌతమ్ కూడా కాలువలోకి దిగాడు. గౌతమ్‌కు ఈత రాకపోవడంతో నీటిలో మునిగి మృతిచెందాడు. తన స్నేహితులకు కూడా ఈత రాకపోవడంతో కాపాడలేకపోయారు. పట్టణ ఎస్సై రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

రక్షించిన కన్నెరసాని బోటింగ్ సిబ్బంది

పాల్వంచ రూరల్, జూన్ 2: కిన్నెరసాని బ్రిడ్జిపై నుంచి డ్యామ్‌లోకి దూకి ఆత్మహత్యకు యత్నించిన మహిళను క్షణాల్లో బోటింగ్ సిబ్బంది రక్షించిన ఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఎన్ఎండీసీ కాలనీకి చెందిన సంజీవరెడ్డి-సరితకు ఇరవై సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. సంజీవరెడ్డి ఎన్ఎండిసీలో పనిచేస్తున్నాడు. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుమార్తె బిటెక్, కుమారుడు ఏడో తరగతి చదువుతున్నాడు. సంజీవరెడ్డి మద్యానికి బానిసై డ్యూటీకి సక్రమంగా వెళ్లడం లేదు. ఆదివారం వారి పెళ్లి రోజు కావడంతో ఇంట్లో ఈ విషయంలో ఇద్దరి మధ్య స్వల్ప ఘర్షణ జరిగినట్టు సమాచారం. దీంతో సరిత క్షణికావేశానికి లోనై కిన్నెరసాని బ్రిడ్జిపై నుంచి డ్యామ్‌లోకి దూకింది. అక్కడ విధులు నిర్వహిస్తున్న జేపీఏ.రత్నం వెంటనే రిజర్వాయర్‌లోని స్పీడ్ బోటింగ్ సిబ్బందికి ఫోన్ చేయడంతో వారు వెంటనే స్పీడ్ బోట్‌లో బ్రిడ్జి వద్దకు చేరుకుని ఆమెను కాపాడారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించి పోలీస్‌స్టేషన్‌లో ఆమెను అప్పగించారు. రూరల్ ఎస్సై శ్రీనివాస్ ఆమె భర్త సంజీవ రెడ్డికి ఫోన్ చేసి సమాచారం అందిచారు. దంపతులిద్దరికి ఎస్సై కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు. జేపీఏ. రత్నం, ఆమెను రక్షించిన బోటింగ్ సిబ్బంది అజర్, కిరణ్, ఫారెస్ట్ సిబ్బంది ఇబ్రహీంను స్థానికులు అభినందించారు.

ఆటోను ఢీకొన్న కారు.. నలుగురికి గాయాలు

పాల్వంచ రూరల్, జూన్ 2: వేగంగా వస్తున్న కారు.. ఎదురుగా వస్తున్న ఆటోను ఢీ కొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్రగాయాలైన ఘటన మండలంలోని నాగారం వద్ద ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాద్రి జిల్లా టేకులపల్లి మండలం బిల్లూడుతండాకు చెందిన నలుగురు ఆదివారం ఆటోలో బూర్గంపహాడ్ మండలంలోని కృష్ణసాగర్‌కు వెళుతున్నారు. ఈ క్రమంలో పాల్వంచ మండలంలోని నాగారం వద్దకు రాగానే ఎదురుగా భద్రాచలం నుంచి వేగంగా వస్తున్న కారు ఈ ఆటోను ఢీకొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న రాందాస్, మంగీలాల్, కృష్ణ, పుల్యాలకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు పాల్వంచ ఆసుపత్రికి తరలించారు. వీరిలో కృష్ణ తలకు, చేతులకు తీవ్రగాయాలు కావడంతో పాల్వంచలో చికిత్స జరిపి మెరుగైన చికిత్స కోసం ఖమ్మం తరలించారు. రాందాస్ ఫిర్యాదు మేరకు పాల్వంచ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

చర్ల, జూన్ 2: ఆదివారం ఉదయం హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో చర్ల మండలం ఆర్ కొత్తగూడెం గ్రామానికి చెందిన అల్లి తరుణ్‌కుమార్ (19), తరుణ్ పెద్దమ్మ కూతురు మనీషా(19) మృతిచెందారు. హైదరాబాద్‌లో తరుణ్, మనీషా రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం జరిగిందన కుటుంబ సభ్యులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను ఆర్ కొత్తగూడెం తీసుకువచ్చినట్టు వారు తెలిపారు.

ఛత్తీస్‌గఢ్‌లో 8 మంది మావోయిస్టుల లొంగుబాటు

కొత్తగూడెం క్రైం, జూన్ 2: ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో పోలీస్ అధికారుల ఎదుట 8 మంది మావోయిస్టులు లొంగిపోయారు. సుక్మా జిల్లా ఎస్పీ కిరణ్‌చవాన్ ఆ వివరాలను ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలో 8 మంది మావోయిస్టులు తమ పార్టీ సిద్ధాంతాలపై విరక్తి చెంది స్వచ్ఛందంగా లొంగిపోయినట్లు వివరించారు. లొంగిపోయిన 8 మందిలో నలుగురిపై రివార్డులు ఉన్నట్లు వెల్లడించారు. కాలం చెల్లిన సిద్ధాంతాలతో ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధికి ఆటంకం మావోయిస్టులు కలిగిస్తున్నారని, నాయకులు తమ కింది స్థాయి వారిని వేధింపులు గురి చేస్తున్నారని, ఈ క్రమంలోనే వారంతా స్వేచ్ఛా జీవనాన్ని గడిపేందుకు ముందుకు వస్తున్నారని తెలిపారు.

బీజాపూర్‌లో మందుపాతర పేలి గ్రామస్తుడికి గాయాలు

కొత్తగూడెం క్రైం, జూన్ 2: భద్రతా దళాలను టార్గెట్ చేస్తూ ఛత్తీస్‌గఢ్ ఏజెన్సీలో మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి ఓ గ్రామస్తుడు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం బీజాపూర్ జిల్లాలో జరిగింది. బీజాపూర్ జిల్లాలోని తార్రెం పోలీస్ స్టేషన్ పరిధిలోని చుట్వాయి నివాసి మద్వి నందా బహిర్భూమి కోసం ఓ చప్టా వద్దకు వెళ్లాడు. అక్కడ మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలడంతో నందా తీవ్రంగా గాయపడ్డాడు. ఈ విషయం తెలుసుకున్న సీఆర్‌పీఎఫ్ బలగాలు.. సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడికి తమ వైద్య కేంద్రంలో ప్రాథమిక చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రానికి తరలించారు.

చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు పంపిణీ

భద్రాచలం, జూన్ 2: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని భద్రాచలం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని 12 మంది చిరువ్యాపారులకు 12 తోపుడు బండ్లను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షురాలు మహాలక్ష్మి మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ భద్రాచలం, రోటరీ క్లబ్ ఆఫ్ మొయినాబాద్ వారి సాయంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమంలో రాజశేఖర్, అసిస్టెంట్ గవర్నర్ వేణుగోపాల్, పాస్ట్ ప్రెసిడెంట్స్ యశోద రాంబాబు, మునికేశవ్, రఫీ, మధు, అజయ్‌కుమార్, అజీమ్, చలపతి, శ్రీధర్‌రెడ్డి, సాంబశివరావు, బందు నర్సింహారావు, చైతన్య, పాషా, ప్రెసిడెంట్ ఎలక్ట్ దారా బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

24గంటలు కరెంట్ ఇవ్వాలి

డీఈ జీవన్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

భద్రాచలం, జూన్ 2: తమకు 24గంటలు కరెంట్ ఇవ్వాలని కోరుతూ టీజీఎన్పీడీసీఎల్ డీఈ జీవన్‌కుమార్‌కు, ఏడీఈ, ఏఈలకు ఆదివారం రైతులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతులు కొడాలి శ్రీనివాసన్, సొసైటీ చైర్మన్ అబ్బినేని శ్రీనివాస్, పరిమి శ్రీనివాస్, కొండవీటి అశోక్, బొడేపూడి వెంకట్రామయ్య, దారపునేని కృష్ణ, ఇంటూరి ప్రవీణ్, తాళ్లూరి చిట్టిబాబు, కొండవీటి చిరంజీవి పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు

సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు

సెల్ : 9182777616